క్లుప్తంగా

'డబుల్ ఇళ్లు' కేటాయించాకే క్వార్టర్లు ఖాళీ చేయించండి

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని సీటైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాకే వారిని ఖాళీ చేయించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఫోన్‌లో కోరారు. 9వ వార్డు సీటైప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలని ఎస్సారెస్పీ అధికారులు కోరిన విషయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేశారు.

ఇబ్రహీంపట్నం ఎంపీవోగా చంద్రశేఖర్



ఇబ్రహీంపట్నం: మండల పంచాయతీ అధికారిగా సాంబారి చంద్రశేఖర్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన కృపాకర్ కోరుట్లకు బదిలీ కాగా.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి చంద్రశేఖర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గోధూర్ పంచాయతీ కార్యదర్శిగా ఎండీ హర్షద్, వర్షకొండ పంచాయతీ కార్యదర్శిగా నవీన్ బాధ్యతలు చేపట్టారు.

కథలాపూర్‌కు రాజశేఖర్..

కథలాపూర్: మండల పంచాయతీ అధికారిగా రాజశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రవీణ్ మల్యాల మండలానికి బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఎంపీవోగా పని చేసిన రాజశేఖర్ కథలాపూర్‌కు బదిలీపై వచ్చి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నరేందర్ బాధ్యతలు తీసుకున్నట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



పెగడపల్లి: పెగడపల్లి ఠాణా ఎస్సైగా సీహెచ్ రవికిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన రామకృష్ణ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న రవికిరణ్‌ను ఇక్కడ నియమించడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎస్సై సత్తయ్య, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న నరేశ్‌రెడ్డి

మేడిపల్లి: కమ్మరిపేట గ్రామానికి చెందిన చెదలు గంగరాజు, ఆకునూరి నిహారికకు రూ.23వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి గురువారం అందజేశారు. ఉరుమట్ల లక్ష్మణ్, అడువాల గంగారెడ్డి, భక్కశెట్టి నగేశ్ తదితరులున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న డాక్టర్ రఘు

మెట్‌పల్లి: వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని రాష్ట్ర నాయకుడు డాక్టర్ చిట్నేని రఘు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలన్నారు. పట్టణాధ్యక్షులు బొడ్ల రమేశ్, ఏలేటి నరేందర్‌రెడ్డి, ఢొనికెల నవీన్, మర్రి పోచయ్య, సుంకేట విజయ్, మద్దెల లావణ్య తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రభుత్వ భూములు పరిరక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతికి వినతి పత్రం సమర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, పార్లమెంట్ కో–కన్వీనర్ నీలి గాయత్రి, జిల్లా అధికార ప్రతినిధి పీసరి నర్సయ్య, కౌన్సిలర్లు మాడవేణి నరేశ్, పెండెం గణేశ్, నాయకులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తండాలో..



వెల్లులలో..

పగలు వెలుగుతున్న వీధి దీపాలు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. వీధి దీపాలు సమయానుసారంగా వేసి తిరిగి సరఫరా నిలిపివేయాల్సి ఉండగా.. విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో వెల్లుల, కేసీఆర్‌తండా గ్రామాల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. కొద్ది రోజులుగా దీపాలు వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆరోపించారు.



పాఠశాలలో వర్షపు నీటి తిప్పలు

మెట్‌పల్లిరూరల్: జగ్గాసాగర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, టీచర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. నిల్వ ఉన్న నీటిలో క్రిమికీటకాలు పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది.





మత్తడి దూకుతున్న మల్యాల చెరువు, చింటకుంట చెరువు

చెరువులకు జల కళ

మల్యాల/జగిత్యాల: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు జల కళ సంతరించుకున్నాయి. చెరువులు, కుంటలు నీటితో కళకళాడుతున్నాయి. మొన్నటివరకు ఎండిపోయిన మల్యాల మండలం మొండికుర్ర ఒర్రె మల్లె గుట్ట పరిసరాల్లో నుంచి వరద నీటితో నిండుగా ప్రవహిస్తోంది. సూరప్ప చెరువు నిండుకుండలా మారింది. స్థానిక మత్తడి చెరువు అలుగు పారుతోంది. జిల్లా కేంద్రంలోని చింటకుంట చెరువు వద్దనున్న మత్తడి దూకుతోంది. మత్తడి దూకడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ధర్మపురిలో బోనాలతో వెళ్తున్న మహిళలు



మెట్‌పల్లిలో..

ఘనంగా పోచమ్మ బోనాలు



మెట్‌పల్లిరూరల్: బోనంతో వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి: ఆషాఢ మాసం సందర్భంగా పోచమ్మ తల్లికి గురువారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక దుర్గమ్మ కాలనీకి చెందిన మహిళలు నూతన పట్టు వస్త్రాలు ధరించి కమలాపూర్ రూట్‌లో ఉన్న బొంబాయి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

మెట్‌పల్లి: పట్టణంలో మనుమయ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘ భవనం నుంచి బోనాలతో ఊరేగింపుగా శివారులో ఉన్న పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్య, కార్యదర్శి సుద్దాల హన్మాండ్లు, రవీందర్, లక్ష్మణ్ తదితరులున్నారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు సమర్పించారు.

మెట్‌పల్లిరూరల్: చౌలమద్దిలో పోచమ్మ బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బ్లాక్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి బోనమెత్తి మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు

సాక్షి స్పందన



రాయికల్: మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులకు గురువారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ చిరంజీవి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈనెల 22న సాక్షిలో పారిశుధ్య కార్మికులకు అందని రెయిన్‌కోట్లు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించి కార్మికులకు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, సాయికుమార్, శ్రీరాముల సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే విజయం



సిరిపూర్ పాఠశాలలో నోటు పుస్తకాలు, సామగ్రి అందజేస్తున్న నల్ల బాపురెడ్డి, ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక సమున్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగితే విజయం తమ సొంతమవుతుందని ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం సంగెం, శ్రీరాంపూర్, సిరిపూర్, కుస్తాపూర్, ఒబులాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, ట్రస్ట్ సభ్యులు పిప్పెర నరేశ్, చింటు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిస్టుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్

జగిత్యాలటౌన్/జగిత్యాలజోన్: రాష్ట్రంలోని ఆర్టిస్టుల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్టిస్టుల సంక్షేమ సమితి నాయకుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. చిత్రకళా చైతన్య యాత్ర గురువారం జగిత్యాలకు చేరుకోగా.. స్థానిక ఆర్టిస్టులు ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమావేశంలో రాజేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా చిత్రకళను నమ్ముకొని జీవిస్తున్న ఆర్టిస్టుల కుటుంబాలను గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఆర్టిస్టులను గుర్తించి ప్రతి నెల రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర గౌరవ సలహాదారు సత్యనారాయణ, సమితి ప్రతినిధులు తొగిటి సతీశ్, మైదం మల్లేశం, కంకణాల సత్యనారాయణ, విశ్వతేజ, మాడిశెట్టి బాలకృష్ణ, మంజు రవి తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..

- జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి



సత్తక్కపల్లిలో పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. సత్తక్కపల్లిలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ కమిటీ పనుల గురించి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ఇందిరానగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. సమస్యల గురించి ప్రధానోపాధ్యాయుడు తాహేర్‌ను అడిగారు. కమిషనర్ మోహన్ ఉన్నారు.

మేడిపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. భీమారం, కట్లకుంట గ్రామాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవో పద్మజ, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



కథలాపూర్ పంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీవో శంకర్

కథలాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో కార్యదర్శులు నిర్లక్ష్యం వహించొద్దని కోరుట్ల డీఎల్పీవో శంకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయా వాడల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి సాయినాథ్, సత్తయ్య ఉన్నారు.

పెగడపల్లి: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శానిటేషన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి నరేశ్, ఎంపీవో మహేందర్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయశీల, తార పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. నాగులపేట గ్రామాన్ని గురువారం సందర్శించారు. వీధులను పరిశీలించి ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురి: వర్షాకాలంలో వచ్చే జబ్బులను అరికట్టడానికి బావుల్లో క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రై–డే కార్యక్రమంలో భాగంగా రామయ్యపల్లె గ్రామంలో గురువారం మండల ప్రత్యేకాధికారి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీవో నరేశ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

ఉద్యాన పంటల పరిశోధన సంస్థలో సైంటిస్ట్‌గా ఎంపిక



జగిత్యాలఅగ్రికల్చర్: జాతీయ ఉద్యాన పంటల పరిశోధన సంస్థ, బెంగళూర్‌లో జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నం నరేశ్ సీనియర్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ మాస్టర్‌కు ఎంపికైన నరేశ్ విశేష ప్రతిభ కనబర్చి మాస్టర్ డిగ్రీలో యూనివర్సిటీ గోల్డ్ మెడల్‌తోపాటు డాక్టర్ భట్ మెమోరియల్ గోల్డ్ మెడల్, డాక్టర్ హర్భజన్ మోమోరియల్ గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు. మిర్చి, వంకాయల పంటల్లో వచ్చే తెగుళ్లపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందాడు. అంతర్జాతీయంగా తైవాన్ వరల్డ్ వేజిటేబుల్ సెంటర్ నుంచి ఫెలోషిప్ పొందడం విశేషం. ఈయన రాసిన పలు ఉద్యాన పంటల ఆర్టికల్స్ అంతర్జాతీయ జర్నల్స్‌లో కూడా ప్రచురితమయ్యాయి. సీనియర్ సైంటిస్ట్‌గా ఎంపికైన నరేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

కార్గిల్ విజయ్ దివస్



నివాళి అర్పిస్తున్న భారత్ సురక్షా సమితి ప్రతినిధులు

జగిత్యాలటౌన్: కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ విజయాన్ని గుర్తు చేసుకుంటూ గురువారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అమరులైన వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, ప్రతినిధులు పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే పెండింగ్ బిల్లులకు మోక్షం



జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్ సరెండర్ లీవ్‌ల బిల్లుల చెల్లింపులు వచ్చే నెలలో చేపడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, త్వరలోనే వస్తాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు అన్నారు. గురువారం జిల్లాలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మహేశ్, బాసిత్, చందన, శోభన, షఫీ, రమేశ్, ప్రవీణ్, రాజేశ్, శ్రీదేవి, శశికళ పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జగిత్యాల: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద మాట్లాడారు. 85కోట్ల మంది బీసీల అభ్యున్నతికి రూ.3,300కోట్లు మాత్రమే కేటాయించారని, తెలంగాణ రాష్ట్రానికి సైతం నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. నాయకులు ఈశ్వరయ్య, గంగాధర్, రాంచందర్ పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవం



రాయికల్: లోక్యానాయక్‌తండాలో గురువారం తీజ్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. యువతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని, ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఉత్సవాలు జరిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

కథలాపూర్: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దానవేని రాజమల్లయ్యకు చెందిన గొర్రెలను మేతకు తీసుకెళ్తుండగా.. గ్రామ శివారులో విద్యుత్ సపోర్ట్ తీగకు విద్యుత్ సప్లయ్ జరగడంతో రెండు గొర్రెలు మృతిచెందాయన్నారు. సుమారు రూ.20వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయారు.

ముగ్గురికి డెంగీ

సారంగాపూర్: మండలంలో ముగ్గురికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు డీఎంహెచ్‌వో సమియోద్దీన్, జిల్లా మాతా శిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలో డెంగీ ప్రభావిత గ్రామాల్లో వీరు పర్యటించారు. లచ్చనాయక్‌తండా గ్రామానికి చెందిన అజ్మీరా దేవోజీ(73), కోనాపూర్ గ్రామానికి చెందిన వేముల గంగవ్వ(58), పోచంపేట గ్రామానికి చెందిన అయిత రాజ్‌కుమార్(21)కు డెంగీ పాజిటివ్ వచ్చిందని, ఈ ముగ్గురికి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందుతోందని, వీరు పూర్తిగా కోలుకుంటున్నారన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

రాయికల్: గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. గురువారం అల్లీపూర్ గ్రామంలోని ఆస్పత్రి సబ్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మొక్కలు పంపిణీ



ధర్మపురి: పట్టణంలోని 1, 2 వార్డుల్లో గురువారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక మామిడివాడ, గాజువాడ, కుమ్మరివాడల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి మొక్కలను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ అయ్యోరి వేణు, నాయకుడు సంగి శేఖర్, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు తదితరులున్నారు.

రేషన్ దుకాణాలకు నాణ్యమైన బియ్యం అందించాలి



మెట్‌పల్లి: రేషన్ షాపులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేసేలా చూడాలని కోరుతూ పట్టణంలోని డీలర్లు గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా నాసిరకం బియ్యం సరఫరా చేస్తుండడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు. దీనికి వెంటనే ఆయన సివిల్ సప్లయ్ డీఎంకు ఫోన్ చేసి సమస్యను తెలపగా.. వచ్చే నెల నుంచి నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు.

ఓపెన్ జిమ్, పార్క్ ఏర్పాటు చేయాలని వినతి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువు వద్ద పార్క్, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మారంపల్లి సాయికుమార్, మహేశ్‌గౌడ్, శ్రీరాముల సువర్ణ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లుకు వినతిపత్రం అందజేశారు.

గోరింటాకు వేడుకలు



కథలాపూర్: సిరికొండ గ్రామంలోని జ్యోతివాణి పాఠశాలలో గురువారం గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు చేతులకు మైదాకు పెట్టుకున్నారు. గోరింటాకు గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం రాజేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పెగడపల్లి: సుద్దపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులు, లబ్ధిదారుల హాజరు పట్టిక పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నదీం ఉన్నారు.